క్లుప్తంగా

బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



నందవరంలో ముస్లింలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

నందవరం : బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ తిమ్మయ్య సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం పెద్దలు, ఆయా గ్రామాల ముస్లిం సోదరులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సోమవారం జరిగే బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య, పోలీసు సిబ్బంది

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని మిట్టసోమపురం క్రాస్ రోడ్డు వద్ద సోమలగూడూరు గ్రామానికి చెందిన వడ్డె వెంకటేష్, జంగం వీరయ్యలు ప్లాస్టిక్ సంచిలో కర్ణాటక మద్యాన్ని తలిరలిస్తుడంగా పట్టుకున్నామన్నారు. కర్ణాటక మద్యం 768 జాన్స్ ఒరిజినల్ చాయస్ విక్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే నిందితులకి కర్ణాటక మద్యాన్ని విక్రయించి చాకలి గోవిందుపై కూడా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వాయుపుత్రునికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న అంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయ స్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. కౌతాళంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులోని బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలోని పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం చేశారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న డీటీ శశిశేఖర్ రావు

కోసిగి: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నిత్యావసర సరుకులను సక్రమంగా అందజేయాలని డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్ రావు ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ లోపు కార్డు దారులందరికీ సరుకులు అందించాల్సి ఉంటుందన్నారు. ఏ ఒక్క కార్డుదారుడి నుంచి కూడా రేషన్ అందలేదనే ఫిర్యాద రాకూడదన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు తిక్కస్వామి, శ్రీరాములు పాల్గొన్నారు.

బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌కు సత్కారం



అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్ సన్మాన కార్యక్రమంలో ఖాతాదారులు

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామం కెనరా బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న శ్రీధర్‌కు శనివారం ఘన సన్మానం చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన బ్యాంక్ మేనేజర్ గిరి, అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల రైతులు, యువకులు, ఖాతాదారులు శ్రీధర్‌ను పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అసిస్టెంట్ మేనేజర్ అందించిన సేవలను గుర్తు చేశారు.

వ్యాధుల కాలం... జాగ్రత్తలు అవసరం

- పొంచివున్న సీజనల్ రోగాల ముప్పు
- ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా జ్వరాలుసోకే ప్రమాదం
- దోమల నిర్మూలనతో డెంగీ, మలేరియా దూరం
- వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ముఖ్యం



ఓపీల కేంద్రం వద్ద వేచి ఉన్న రోగులు



రక్త పరీక్ష చేయించుకోవడానికి క్యూలో వేచి ఉన్న రోగులు

ఆదోని అర్బన్: వర్షాకాలం సీజన్ ప్రారంభమయ్యింది. వాతావరణంలో మార్పులు, వర్షాల మూలంగా చిత్తడితో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అపరిశుభ్రత, ఆహారంలో లోపాల కారణంగా రోగాలు సోకుతాయి. ముందు జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వల మూలంగా వ్యాధి కారకాలైన దోమలు, సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియా వృద్ధి చెందుతాయి. దీంతో విషజ్వరాలు విజృంభించే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఆదోని డివిజన్ పరిధిలో అక్కడక్కడ మాత్రమే సాధారణ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. రోగుల సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతుంది. అప్రత్తంగా వ్యవహరించుకుంటే జ్వరాలు ప్రబలే ప్రమాదాలు లేకపోలేదు. వానాకాలంలో సాధారణ జ్వరం, దగ్గు నుంచి ప్రమాదకరమైన డెంగీ వరకు వ్యాధులు సోకుతాయి. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచిస్తున్నారు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు. వర్షాకాలంలో ఏ వ్యాధులు ఎలా వస్తాయి... నివారణ, జాగ్రత్తలను సూపరింటెండెంట్ వివరించారు.

వైరల్ జ్వరాలు: సీజన్ మార్పుతో జరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. గాలి, నీరు ద్వారా సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి జ్వరం సోకుతుంది. కొందరికి జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం మూడు నుంచి ఏడు రోజుల వరకు ఉంటుంది.

జాగ్రత్తలు : భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవాలి. నిల్వ పదార్థాలు తినరాదు. తాజా వేడి ఆహారం తీసుకోవాలి.

చికెన్ గున్యా: దోమకాటు వల్ల చికెన్‌గున్యా వస్తుంది. తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులు రోగ లక్షణాలు. రోజురోజుకు జ్వర తీవ్రత పెరుగుతుంది.

జాగ్రత్తలు: ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కూలర్లు, టైర్లు తదితర వాటిలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. శరీరం మొత్తం కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలి.

మలేరియా : ఆడ అనాఫలిస్ దోమ కాటు మలేరియా వ్యాపిస్తుంది. మలేరియాక్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయి. 14 రోజుల తర్వాత తీవ్ర జ్వరం వస్తుంది. ఆ దోమలు నిల్వ ఉన్న వర్షపునీటిలో వృద్ధి చెందుతాయి.

జాగ్రత్తలు : దోమలు కుట్టకుండా దోమతెరలను వినియోగించుకోవాలి. ఇంటి చుట్టూ నీటినిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ లేదా పురుగుమందు కలపాలి.

డెంగీ : ఈడీస్ ఈజిప్ట్ అనే దోమకాటు మూలంగా డెంగీ సోకుతుంది. అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తలనొప్పి, ఒళ్లునొప్పులు, ఎముకలు విరిగేడంత నొప్పి ఉంటుంది. ఒక్కసారి శరీర అంతర్భాగాల్లో రక్తస్రావం ఉంటుంది. కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదరం భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్నపాటి పొక్కులు వస్తాయి. ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ పడిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది.

జాగ్రత్తలు: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమతెరలను వాడడం మేలు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి. దోమలు కుట్టకుండా శరీరం కప్పేలా దుస్తులు వేసుకోవాలి.

కామెర్లు : వర్షాకాలంలో కామెర్ల వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కలుషితమైన నీరు, ఆహారం మూలంగా సూక్ష్మక్రిములు శరీరంలోకి వ్యాపిస్తాయి. ఇవి కాలేయ కణాల్లో సంక్రమిస్తుంది. కాలేయవ్యాధి కారణంగా రక్తంలో బిలిరూబిన్ పరిమాణం పెరుగుతుంది. శరీర భాగాలు పసుపు రంగులో కనిపిస్తాయి.

జాగ్రత్తలు: శుభ్రమైన ఆహారం తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వ్యక్తిగత మరుగుదొడ్లను వాడాలి.

టైఫాయిడ్ : టైఫాయిడ్ సాల్మోనెల్లా టైఫీ బ్యాక్టీరియా మూలంగా ఈ వ్యాధి సోకుతుది. కలుషిత నీరు, ఆహారం మూలంగా టైఫాయిడ్ వ్యాపిస్తుంది.

జాగ్రత్తలు: కాచి చల్లార్చిన నీరు తాగడం ఉత్తమం. రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. పండ్ల రసం, కొబ్బరి నీరు, సూప్ వంటివి తీసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే సమయం కావడంతో జ్వరం కేసులు పెరుగుతున్నాయి. జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్సలు చేయించుకోవాలి. ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి సకాలంలో వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, ఏరియా ఆస్పత్రికి ప్రతిరోజూ 750 మందికి పైగా రోగులు వస్తున్నారు. అందులో వంద మందికి రక్తం, యూరిన్ పరీక్షలకు పంపుతున్నాం. ఒక్కొక్కరికీ 20 పరీక్షలు రాస్తున్నాం. ప్రజలు శుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత శుభ్రత పాటిస్తే రోగాలు దగ్గరికి రావు.

– శ్రీరాములు, ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

రాజగోపురానికి విరాళాల వెల్లువ



దాతలకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శనివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన కృష్ణమూర్తి, నందిని దంపతులు రూ. 1,00,116, నాగలపురం గ్రామానికి చెందిన మూసాని మేఘనాథ్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు రూ.50,000 అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్. వెంకటేష్ తెలిపారు. దాతలకు ఆలయాధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల తదితర అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి సంతాపం

కోసిగి: వైఎస్సార్‌సీపీ కార్యకర్త, గౌడుగల్లు గ్రామ సర్పంచ్ శివమ్మ భర్త బి. పెద్ద ఈరన్న (65) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ శివమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

సీనియారిటీ జాబితాలో లోపాలను సరిదిద్దాలి



నిరసన తెలుపుతున్న పురపాలక ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పురపాలక ఉపాధ్యాయుల సినియారిటీ జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్ది ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక పట్టణశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్ కుమార్, బసవరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం భోజన విరామ సమయంలో పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన విద్యాశాఖ అధికారులు ప్రకటించిన సినియారిటీ జాబితా పురపాలక విద్యావ్యవస్థపై సరైన అవగాహనలేమిని తెలియజేస్తుందన్నారు. పురపాలక విద్యావ్యవస్థలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులను కూడా సినియారిటీ జాబితాలో చూపిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను జాబితాలో చేర్చడం, అపాయింట్‌మెంట్ తేదీలను ముందు, వెనుకాల వేసి జాబితాను రూపొందించారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా బదిలీలను జీఓ నంబర్.506, 507 ద్వారా చేపట్టాలన్నారు. అదేవిధంగా జాబితాలోని అభ్యంతరాలను సమర్పించేందుకు గడువును పొడగించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంటీఎఫ్ నాయకులు ఆనంద్, సురేష్ కుమార్, మద్దయ్య, దస్తగిరి, జంగం బసవరాజు, సాల్మన్‌రాజు, ఈశ్వరమ్మ, హర్షాశిల్ప తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయ

ఆదోని టౌన్: ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో పట్టణ, తాలుకా, గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవపూజ ధనుంజయ్య ఆచారి మాట్లాడుతూ బీసీల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. మన రాష్ట్రంలో కుల గణన సర్వే నిర్వహించారని, బీసీ కులాలవారీగా సంఖ్య ప్రకటించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు, డివిజన్ ఉపాధ్యక్షులు ఫక్రుద్దన్, పెద్దహరివాణం దేవేంద్రప్ప, ధణాపురం శేషన్న, దేవిశెట్టి ప్రకాష్, తాలూకా గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, వీరభద్ర, అలిగేర రామాంజనేయులు, డాక్టర్ సోమశేఖర్, బి.మల్లేశ్వరప్ప, వడ్డే మహాదేవ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్: రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకండి.... ఏ సమస్య వచ్చినా నేరుగా తనదృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మున్సిపల్ ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఉద్యోగులతో శనివారం సమీక్షా సమావే నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్షన్ల వారీగా అధికారులను పరిచయం చేసుకుంటూనే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు తదితర విషయాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రజలు కోరుకున్న మార్పును సాధిద్దామని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఉద్యోగులను ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎంఈ చలపతిరావు, అన్నిశాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుభ్ర గ్రామమే లక్ష్యం

ఆదోని రూరల్: పారిశుభ్ర గ్రామాలే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మండలంలోని బైచిగేరి, నాగనాథనహళ్లి, సంతెకూడ్లూరు, మండిగిరి గ్రామాలకు మంజూరైన ట్రాక్టర్లను ఆయన చేతులమీదుగా రిబ్బన్‌కట్ చేసి ఆయా గ్రామాల సర్పంచ్‌లు మహాదేవ, వరదప్ప, సర్పంచ్ భర్త భీమేష్‌లకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారాన్ని తొలగించేందుకు 75 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులు, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులు వెచ్చించి ట్రాక్టర్లను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర్‌రావు, మాజీ ఎంపీపీ బడాయి పంపాపతి, మధు, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దుకు పోర్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యుడు నరేంద్రనాథ్‌రెడ్డి

నందవరం : మండల పరిధిలోని జొహరాపురం గ్రామానికి చెందిన రైతు కురవ రంగప్పకు చెందిన ఎద్దు విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన మేరకు వివరాలు .. గ్రామానికి చెందిన రంగప్ప అనే రైతు కాడెద్దులతో గంగవరం గ్రామానికి చెందిన కమతం రాజశేఖర్ రెడ్డి పొలంలో గుంటక పాయడానికి బాడుగకు వెళ్లాడు. పత్తిపొలంలో గుంటక పాస్తుండగా పొలంలోని కరెంట్ స్థంభానికి ఉన్న జీ(సపోట్) వైర్ ఎద్దుకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే కుప్పకూలి మృత్యువాత పడింది. స్థంభానికి ఉన్న జీ వైర్‌కు కరెంట్ పాస్ అవడంతో ఎద్దు చనిపోయిందని బాధితుడు వాపోయాడు. రూ.60 వేలు నష్టం వాటిలిందని, ఆదుకోవాలని కోరాడు. అనంతరం పశు వైద్యుడు డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి ఎద్దుకు పోర్టుమార్టం నిర్వహించారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అభివృద్ధి పనులపై శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులను ఆరాతీశారు. పట్టణ వాసులకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సీతారామయ్య, మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఆర్‌ఓ బేబి, ఏఈలు మదన్, శరత్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం శివన్న నగర్ ప్రాంతంలో గ్రావెల్ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా రెండో అదనపు జడ్జి



సబ్‌జైలులో సరుకులు నిల్వ ఉన్న గోదామును పరిశీలిస్తున్న జడ్జి పీజే సుధ



ఖైదీల గదులను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని స్పెషల్ సబ్ జైల్‌ను శనివారం జిల్లా రెండో అదనపు జడ్జి, సెషన్స్ జడ్జి పీజే సుధ తనిఖీ చేశారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల గదులు, వంటశాల, రేషన్ గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. క్షణికావేశంలో చేసిన నేరాలకు శిక్ష అనుభవిస్తున్నారని, ఎవరూ క్షణికావేశానికి లోనుకాకూడదని సూచించారు. జీవితం ఎంతో విలువైనదని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జడ్జి వెంట జైలు పర్యవేక్షణాధికారి నజీర్‌అహ్మద్, ఉచిత సహాయ న్యాయవాది ఆనంద్, అడ్వకేట్ లోకేష్, కోర్టు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ములాఖత్ వేళల్లో మార్పులు

– సబ్‌జైలు పర్యవేక్షణాధికారి నజీర్‌అహ్మద్

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని స్పెసల్ సబ్‌జైలులో ఖైదీలు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుకునేందుకు కల్పించే ములాఖత్ వేళల్లో మార్పులు చేసినట్లు సబ్‌జైలు పర్యవేక్షణాధికారి నజీర్‌అహ్మద్ తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంగళగిరి జైళ్ల శాఖాధిపతి ఆదేశాల మేరకు ఈనెల 18వ తేదీ నుంచి ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4:30 గంటల వరకు ములాఖత్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సందర్శకులు సమయాన్ని గమనించాలని సూచించారు.

మహిళలు క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: మహిళలు కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారిణి హేమలత సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆదోని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ సోకే కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. క్యాన్సర్ వ్యాప్తి తీరును వైద్యసిబ్బంది మహిళలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు గీత, విజయభారతి, సంధ్యారాణి, సోమశేఖర్‌స్వామి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



పాడిరైతులకు మేలైన గడ్డి జాతి విత్తనాలు అందజేస్తున్న వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి

నందవరం : పాడిరైతులు పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించుకోవాలని వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ సూచించారు. శనివారం మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో పశువులకు సక్రమించే వ్యాధులు, టీకాలు, పశుపోషణపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పశువులకు చూడి పరీక్షలు చేసి మాన్‌కైండ్ ఫార్మ ఆధ్వర్యంలో ఫెర్టిలిటీ క్యాంప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు పశువులకు మేలైన గడ్డి జాతి మొక్కలను పెంచుకోవాలన్నారు. పశువులకు ముందు జాగ్రత్తగా టీకాలు వేసుకోవాలని పాడిరైతులకు సూచించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ గిరిప్రసాద్, పశుసంవర్ధక సహాయకులు మల్లికార్జున, వంశీ, శ్రీదేవి, సంధ్య సిబ్బంది పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



పాత నేరస్థులతో మాట్లాడుతున్న సీఐ గోపీ

ఆదోని అర్బన్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదోని టూటౌన్ సీఐ గోపీ హెచ్చరించారు. శనివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పేకాట, మట్కా, నాటుసారా కేసులతో సంబంధం ఉన్న పాత నేరస్తులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా భవిష్యత్‌లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

18 నుంచి విరుపాపురంలో ధార్మిక కార్యక్రమాలు



కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను చూపుతున్న గ్రామస్తులు

ఆదోని అర్బన్: ఈనెల 18వ తేదీ నుంచి తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. శనివారం వీటికి సంబంధించిన కరపత్రాలను గ్రామంలో ప్రజలకు అందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో నాలుగు రోజులపాటు ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్‌చే మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు, గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు న్యాయకంటి భీమిరెడ్డి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



